చిత్ర ప్రభ

# దేవుని పేర మోసం ...... శ్రీమతి దేవిక

దైవం అనే మాటకు నేను ఎక్కువ విలువ ఇస్తాను. ఇంకాచెప్పాలంటే శాస్త్రాన్ని,ఆచారాలను, జోస్యాన్ని, నేను నమ్ముతాను. ఈ నమ్మకం నాకు మాత్రమే కాదు. మా ఇంట్లో వాళ్లందరికీ కూడా ఉందనుకోండి. ఈ నమ్మకాలు, దేవుడి యందు భయభక్తులు ఉండటం మంచిదేగాని, అది మరీ అతి అయితే మాత్రం చాల జాగ్రత్తలో ఉండాలి. ఎందుకంటే మన నమ్మకాన్ని చూసి దేవుడుపేర మనల్ని మోసం చేయటానికి కొంత మంది ఏమాత్రం కూడ వెనుదీయరు. కాని మనం మోసపోకుండా సకాలంలో భగవంతుడు కాపాడగలడులెండి.

దేవుడంటే భయభక్తులున్నవారికి కాస్త కష్టాలు వస్తే, ఇహ అంతాభగవంతుడు మీదే భారంవేసి కూర్చుంటారు. అలాంటి పరిస్థితే ఓసారి ఏర్పడింది మాకు. అదే మీకు ముందే చెప్పేనుగా మా ఇంట్లో అందరూ ఆస్తికులే అని. దానికి తగ్గట్టు మాకుటుంబంలో ఆస్తుల విషయంలో కొన్ని గొడవలొచ్చాయి. అవి ఎంతకీ తీరకపోయేసరికి మా ఇంట్లోవాళ్లకి మానవ ప్రయత్నంమీద నమ్మకం పోయిఇహాభగవంతుడే దిక్కు అనేవరకు వచ్చి, ఆస్తి మనకు రావలసిందైతే వస్తుంది, లేకపోతే ప్రాప్తమెంతో అంతే అనుకుని వూరుకొన్నాము.

ఒకరోజు మాకు మూడో ఇంటావిడ వచ్చి మా అమ్మగారితో మాట్లాడుతూండగా మా ఆస్తుల విషయం వచ్చి, ఆ కోర్టు కచేరీల విషయం ఇంతదాకా తేలలేదు, ఏం చేస్తామండీ, ఏదో ప్రాప్తముంటే దక్కుతుంది లేకపోతే పోనీ లెండి అని అమ్మ నిస్పృహపడితే, అదేమండీ అలా అని సొమ్ము పోగొట్టుకుంటావా అని మా అమ్మగారిని మందలించి ఆవిడ సలహా ఇచ్చింది. ఏమిటంటే, ఎక్కడో ఒకరిమీద పూనకం వస్తుందని అప్పుడు వాళ్లు చెప్పినవన్నీ నిజంగా జరుగుతున్నాయని, పైగా మన కష్టాలు తీరడానికి ఆ అమ్మ



శ్రీరామా పిక్చర్సు "దేశద్రోహులు" లో దేవిక

వారు సహాయం కూడా చేస్తుందని చెప్పింది. ఈ విషయం నాకు ఇంతకుముందే తెలుసు. అమ్మవారి గుళ్లలో పూనకం వచ్చినవారినిచూసి ఉన్నాను. మా ఇంటిదగ్గర్లో అమ్మవారి గుళ్లుండేవి. తరుచు ఇలాంటి విశేషాలు జరుగుతూండేవి. మా ఇంటిదగ్గర్లో ఒకతను ఉండేవాడు. అతని మీద అమ్మవారు పూనేదట. అతను ఎప్పుడూ చీరె, జాకెట్టు కట్టుకుని తిరిగేవాడు. మా వీధుల వెంట వచ్చినప్పుడు, పిల్లలందరూ ఆశ్చర్యంగా చూసేవారు. ఆడదానిలాగే నగలు వేసుకొనేవాడు.



ప్లాట్ నెం. 9 చిత్రంలో సయీదా ఖాన్

ఇవన్నీ అటుంచి, అతను చెప్పినవన్నీ జరుగుతాయని చాలమంది అంటుండేవారు. ఈ నమ్మకంతో మా మూడో ఇంటావిడ చెప్పిందాన్ని అదేదో కనుక్కోవాలని మా అమ్మగారు అనుకొన్నారు. ఓ శుక్రవారంపూట, మూడో ఇంటావిడా మా అమ్మగారు కలసి అమ్మవారి గుడికిబయలుదేరి వెళ్ళారు. అక్కడ ఎవరిమీదో పూనకం వచ్చింది. ఆవిడ ఏదో చెప్పింది. కాస్త మంత్రించిన కుంకం, విభూది ఇచ్చింది. ఇట్లాగే ప్రతి శుక్రవారం మా అమ్మ వాళ్ళు వెళ్ళి వస్తుండేవాళ్ళు. నేను కూడ తీరికైనప్పుడు వెళ్ళేదాన్ని. ఇట్లాగే కొన్ని రోజాలు గడిచి పోయినై. అక్కడ ఒకతను ఉండేవాడు. మేము శుక్రవారం వెళ్ళలేకపోతే, అతనే పట్టుకొచ్చిప్రసాదాన్ని ఇచ్చివెళ్ళేవాడు. వచ్చినప్పుడల్లా పూజకోసం డబ్బు తెమ్మన్నారని చెప్పి, అడిగి తీసికెళ్ళతూండేవాడు. ఇలా ఓ నెల్లాళ్ళు జరిగి పోయింది.

కాని ఉన్నట్టుండి ఒకరోజు అతనిమీద పూనకం వచ్చింది. నాకు ఇప్పుడు 500 రూపాయలు కావాలి. నువ్వు ఇచ్చేతీరాలి అని కూర్చున్నాడు. ఇప్పుడు ఇవ్వలేము అని అంటే అదేం కుదరదు, ఇవ్వకపోతే కష్టాలపాలై పోతారు అని అన్నాడు. సరే ఇహ గత్యంతరం లేక ఇచ్చిపంపాము. ఇహ దాంతో రోజూ ఇదే తీరు. రోజూ వచ్చేవాడు. కూర్చున్నవాడల్లా ఉన్నట్టుండి ఒక వూగు వూగి అమ్మవారు మాట్లాడుతున్నట్లుమాట్లాడేవాడు మాయింట్లో మామూలుగా జరిగే విషయాల్ని చెప్పేవాడు. ఆసమయంలో ఇది మాకు అర్థమయేది కాదు. అహో! ఇంటి విషయాలన్నీ చెబుతున్నాడుగదా, ఎంత మహిమ లేకపోతే అంతా చెబుతున్నాడని మేమంత నమ్మేవాళ్ళం. ఇట్లాగే రోజూ డబ్బుడబ్బు అని పట్టుకెళ్ళేవాడు. మేము చాల భయభక్తులతో సొమ్ము ముట్టజెప్పేవాళ్ళం. అలా పూనకం వచ్చినప్పుడు, చిన్న బిందెడు పసుపు నీళ్ళు తాగి ఒక కట్ట వేపాకు తిని ఒక గడ్డ కర్పూరం వెలిగించి నోట్లో వేసుకొనేవాడు. శరీరాన్నంతా ఒక్కసారి గట్టిగా వూపుకొనేవాడు ఇంతహడావిడి చూసి మేమంతా చాల భయభక్తులతో అతను చెప్పేదానిని నమ్మాం.

ఇట్లా ఉండగా, ఒకరోజు ఏం మొదలెట్టాడంటే, మొదటమేము వెళ్తుండేవాళ్లమే పూనకం వచ్చే చోటుకు, అక్కడకు వెళ్ళొద్దని చెప్పేవాడు. పైగా అది అంతా దగా అని వాళ్ళ మోసం, నటన అని చెప్పి వాళ్ళని తిట్టేవాడు. వీడు చేస్తున్న హడావిడి చూసి నిజంగా వాళ్ళ మోసం అని అంతా నమ్మాం.

ఎందుకంటే వాళ్ళు చెప్పినట్లు మా ఆస్తుల విషయంలో ఎలాంటి మార్పులు రాలేదు. కానీ పూజలకి డబ్బు మాత్రం పట్టుకెళ్ళేవాళ్ళు. భగవంతుడిమీద నమ్మకం కొద్దీ, వీటన్నిటినీ కాదని వాళ్ల దగ్గరనుంచి తప్పించుకోలేక పోయేవాళ్లం. ఇక్కడ ఇతను వాళ్లను తప్పించి తనే పూనకం వచ్చినట్లు నటించి రోజూ డబ్బులు పట్టుకెళ్ళేవాడు.

కాని ఒకరోజు మాత్రం ఒక గమ్మత్తు జరిగింది. రోజూ ఏంచేసేవాడంటే బీరువాలో ఉంది డబ్బు తీసియ్యి అని దబాయించి తీసికెళ్లేవాడు ఎలాగూ బీరువాలోనే ఉంటుందనే నమ్మకంతో . పైగా అనేవాడు అమ్మవారు చెప్పినట్లు చెబుతూ 'పాపం! ఈతనికి కట్టుకోడానికి మంచి బట్టల్లేవు. ఇతనికి ఇంటి పెత్తనం అప్పజెప్పండి. జాగ్రత్తగా చూస్తాడు. మీఅమ్మాయి సంపాదించినదాంట్లో సగండబ్బు నాకు ముట్టజెప్పాలి'' అని అనేవాడు.

వీడు ప్రతిరోజూ డబ్బు అడగటంవల్ల మాకు కొంత సందేహం కలిగి బీరువాలో ఉన్న డబ్బు నగలు తీసి వంటింటిలో ఉంచాము. వాడు యధాప్రకారం వచ్చి దేవికి దోషం తగిలింది వెంటనే 500 రూపాయలు కావాలి అని అడిగాడు.

అప్పుడు మా అమ్మతో మరీ మరీ చెప్పించాము ఇంటిలో కానీకూడ లేదని. అంతా నీకేగదా ఇచ్చాము అన్నారు మా అమ్మ. వెంటనే నగలు ఇవ్వమన్నాడు వాడు. మా అమ్మ అయ్యో! ఈశ్వరా!! డబ్బు అంతా అయిపోయింది, అందువల్ల నగలు తాకట్టు పెట్టాము, అదికూడ నీకే ఇచ్చాము అని అన్నారు. వాడు సరే డబ్బు వచ్చిన వెంటనే వచ్చినదానిలో సగం తనకు ఇచ్చివేయాలన్నాడు. లేకపోతే మీరంతా చెల్లాచెదరైపోతారన్నాడు.

ఆరోజునుంచి మా పిచ్చి అంతా కుదిరింది. ఆరోజునే అనుకున్నాం ఇహ మీదట ఇలటి విషయంలో జాగ్రత్తగా ఉండాలని. అమ్మవారయితే ఇంట్లో డబ్బున్న సంగతి తెలియకుండా ఉంటుందా? ఆతర్వాత అతడుకూడ రోజూ రావటం మానేశాడు. కొన్నిరోజుల తర్వాత మేము మొదట వెళ్తుండే (పూనకం వచ్చేచోటు) చోటునుంచి కబురు వచ్చింది. ఈ శుక్రవారం అమ్మవారికి పూజ చేస్తున్నాం మీరు తప్పక రావాలని. అమ్మకు ఇష్టం లేకపోయినా బలవంతాన తీసికొని వెళ్లారు. మా అమ్మ జరిగిందంతా చెప్పి, మీరు ఇలాంటి మనుష్యుల్ని మా ఇంటికి పంపడం బాగా లేదు అని అన్నారు. వాళ్లు అంతా విని, మాకేం తెలీదనీ, ఇక్కడికి అతను రావటం మాని చాల రోజులయిందనీ చెప్పారు. ఎందుకంటే ఇట్లాగే ఎవరింట్లోనో దబాయించి చాల డబ్బు పట్టుకు వెళ్లితే తాము చీవాట్లు పెట్టామనీ, అందుకని అతను రావటంలేదనీ అన్నారు. అప్పుడర్థమయింది ఎందుకని అతడు ఇక్కడికి వెళ్లొద్దన్నాడో. దాంతో అక్కడికి వెళ్లటంకూడ మానేశాము. కాని నిజంగా దేవుడేనని నమ్మి మేము విశ్వసించినందుకు మాకు మేలే జరిగింది. ఈనాడు ఆ భగవంతుడి కృపవల్లే నటిగా పేరులోకి వచ్చి హాయిగా సుఖంగా జీవించగల్గుతున్నాము.

ఈ సంఘటనతో దేవునియందు ఇంకా గాఢమైన నమ్మకమూ, ఇలా పైపై వేషాలు వేసి దేవునిపేర మోసం చేసేవారి వలలో చిక్కుకోకుండా ఉండగల జాగ్రత్తా, బాగా ఏర్పడినాయి.

★



శ్రీరామకృష్ణ ప్రొడక్షన్స్ చిత్రంలో దేవిక, ఎన్.టి. రామారావు

ఎం.ఎం. పిక్చర్సు చిత్రంలో రమణమూర్తి, జమున

